బాధ్యతత స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న రవికుమార్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 1 : జిల్లా ఇంటర్ విద్యాధికారిగా రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన రఘురాజ్ ఆదివారం ఉద్యోగ విరమణ చేయగా.. రవికుమార్‌ను జిల్లా ఇంటర్ విద్యాధికారిగా నియమిస్తూ రాష్ట్ర ఇంటర్మీడియెట్ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు. రవికుమార్ వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ ఇటీవలే ఇంటర్ విద్య మూల్యాంకనం కేంద్ర అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో ప్రిన్సిపాళ్లు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలో పలు యూనియన్ల లెక్చరర్ల సంఘ నాయకులు రవికుమార్‌ను సన్మానించారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

ధర్పల్లి, ఏప్రిల్ 1 : ఎండలు తీవ్రంగా ఉన్నందున తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో బాలకృష్ణ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల కార్యదర్శులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సమావేశంలో డిప్యూటీ ఈఈ ధర్మేందర్, అసిస్టెంట్ ఇంజినీర్ దామోదర్, ఎంపీవో రాజేశ్ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ధర్పల్లి, ఏప్రిల్ 1 : ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీవో బాలకృష్ణ అన్నారు. మండలంలోని చెరువు తండా గ్రామపంచాయతీ పరిధిలోని కళాశాల తండాలో సోమవారం ఆయన పర్యటించారు. తాగునీటి ట్యాంకును పరిశీలించారు. తండావాసులతో సమావేశం ఏర్పాటు చేసి నీటి ప్రాముఖ్యతను వివరించారు.

నర్సరీ పరిశీలన

రుద్రూర్, ఏప్రిల్ 1 : మండలకేంద్రంలో డీఎల్పీవో సాయిబాబా సోమవారం పర్యటించారు. ఎంపీవోతో కలిసి నర్సరీతోపాటు కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కంపోస్ట్ షెడ్డును మరింత ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు.

ఘనంగా భీమన్న ఆలయ వార్షికోత్సవం

బోనాలను ఊరేగిస్తున్న నాయక్‌పోడ్ సంఘ సభ్యులు

సారంగాపూర్, ఏప్రిల్ 1 : మండలంలోని మల్లారంలో నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. మహిళలు బోనాలను ఊరేగించారు. ఉత్సవాల్లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్ పాల్గొన్నారు. అనంతరం లింగేశ్వరగుట్ట ఆశ్రమాన్ని ఎమ్మెల్యే భూపతిరెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. ఆశ్రమాభివృద్ధికి సహకరించాలని గుట్ట ఆశ్రమపీఠాధిపతి ఎమ్మెల్యేను కోరారు.

రాష్ట్రపతి భవన్‌లో తెలుగువైద్యుడి సేవలు

సిబ్బందితో వైద్యుడు గోలి శ్రీనివాస్

వేల్పూర్, ఏప్రిల్ 1: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యాన్‌లో వేల్పూర్ మండలం వాడీ గ్రామానికి చెందిన డాక్టర్ గోలి శ్రీనివాస్ వైద్య సేవలను అందించారు. ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో సందర్శకులను అమృత ఉద్యాన్‌లోకి అనుమతిస్తారు. ప్రస్తుతం డాక్టర్ గోలి శ్రీనివాస్ ఢిల్లీ నగరపాలక సంస్థలో సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంతకుముందు జనవరిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకలు, బీటింగ్ రీట్రీట్ వేడుకల్లోనూ మెడికల్ టీమ్స్‌కు నాయకత్వం వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పోతంగల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో సుప్రియ

యానంపల్లి కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సిరికొండ/ కోటగిరి/ చందూర్/ డిచ్‌పల్లి/ మాక్లూర్/ బోధన్ రూరల్/ ఆర్మూర్‌టౌన్/ ఎడపల్లి/రెంజల్, ఏప్రిల్ 1 : జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సొసైటీ చైర్మన్లు, సభ్యులతో కలిసి సోమవారం ప్రారంభించారు. సిరికొండ సహకార సంఘం పరిధిలోని కొండూర్, పెద్దవాల్గోట్, సిరికొండలో కొనుగోలుకేంద్రాలను జిల్లా కొనుగోలు కేంద్రాల పరిరక్షణ అధికారి శ్రీనివాస్ ప్రారంభించారు. కోటగిరి సహకార సంఘం, పొతంగల్ సహకార సంఘం పరిధిలోని కల్లూర్, పొతంగల్, హెగ్డోలిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కోటగిరి విండో సీఈవో విఠల్, పొతంగల్ ఏఈవో సుప్రియ ప్రారంభించారు. చందూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో సౌజన్య, సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం క్వింటాలు ఏ–గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,203, బీ – గ్రేడ్ రకానికి రూ.2,183 అందజేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డిచ్‌పల్లి మండలంలోని లింగసముద్రం, యానంపల్లి తండా, యానంపల్లి, సుద్దులం, కోరట్‌పల్లి, కోరట్‌పల్లి తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, వైస్‌చైర్మన్ కుమ్మరి చిన్నగంగారాం ప్రారంభించారు. మాక్లూర్ మండలంలోని చిక్లీ, కొత్తపల్లి, గుంజిలి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాక్లూర్ పీఏసీఎస్ చైర్మన్ బూరోళ్ల అశోక్ ప్రారంభించారు.

బోధన్ మండలంలోని పెంటాకలాన్, అమ్దాపూర్ గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సహకార సంఘాల జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్ ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), ఆర్మూర్ పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

ఎడపల్లి మండలకేంద్రంతోపాటు ఒడ్డపల్లి గ్రామంలో ఎడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి అధ్యక్షతన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జడ్పీ వైస్ చైర్పర్సన్ రజితా యాదవ్, సొసైటీ చైర్మన్ మల్కారెడ్డి మాట్లాడారు. రెంజల్ మండల కేంద్రంతోపాటు నీలా, దూపల్లి సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో ధాన్య కొనుగోలు కేంద్రాలను సీఈవోలు రాము, రాందాస్, జీవన్ రెడ్డి, ఎండీ సనా ఉల్‌హాక్ ప్రారంభించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1: మండలంలోని యానంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు.. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయిస్ డీఎం జగదీశ్ ఉన్నారు.

మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం ఉదయం స్వామివారిని సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. అనంతరం ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.
– మోపాల్ (ఖలీల్‌వాడి), ఏప్రిల్ 1

డీసీవోను కలిసిన సొసైటీ డైరెక్టర్లు

ఇందల్వాయి, ఏప్రిల్ 1 : మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్లు ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్‌పై అవిశ్వాసాన్ని కోరుతూ డీసీవో శ్రీనివాసరావును సోమవారం కలిశారు. అవిశ్వాసానికి ఆమోదం తెలిపి ఎన్నికలు నిర్వహించాలని డైరెక్టర్లు కోరారు.

ముగిసిన వృత్తి విద్యాకోర్సు పరీక్షలు

రుద్రూర్, ఏప్రిల్ 1 : ఎస్ఎస్‌సీ విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సు పరీక్షలు సోమవారం పూర్తయ్యాయి. మండలపరిధిలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులు పరీక్షలు రాసి సంతోషంగా బయటికి వచ్చారు.

20 ఏండ్లుగా నమ్మించి.. మోసం చేశాడు..

- పెండ్లి చేసుకుంటానని చెప్పి ఇప్పుడు ముఖం చాటేస్తున్నాడు..
- ఇది మా కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ బెదిరిస్తున్నాడు..
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముప్పా గంగారెడ్డిపై
- నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు

కంఠేశ్వర్, ఏప్రిల్ 1: జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కిసాన్ ఖేత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పా గంగారెడ్డి తనను నమ్మించి మోసం చేశాడని ఆరోపిస్తూ మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన చంద్రకళ అనే మహిళ సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముప్పా గంగారెడ్డి తనను పెండ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆరోపించింది. 20 ఏండ్లుగా తనతో కలిసి ఉంటున్నాడని, రెండేండ్ల నుంచి కేవలం ఫోన్‌లోనే మాట్లాడుతున్నాడని తెలిపింది. తమకు ఓ కొడుకు కూడా పుట్టాడని కానీ ఇప్పుడు తన కొడుకు కాదంటున్నాడని వాపోయింది. తనకు ఆరోగ్యం సహకరించడం లేదని, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని తెలిపింది. ఇంతకాలం అన్ని చూసుకుంటానని చెప్పి ఇప్పుడు మాటమార్చాడని అడిగితే డబ్బులు లేవని, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని సమాధానం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇది మా కాంగ్రెస్ ప్రభుత్వం..మా ఇష్టం ఉన్నట్లు నడుస్తది..ఎవరికీ చెప్పినా నాకేం కాదంటూ అంటున్నాడని వాపోయింది. పెండ్లి చేసుకుంటానని మోసం చేసి ఇప్పుడు ఎటువంటి సంబంధం లేదని అంటున్న ముప్పా గంగారెడ్డి పై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. కలెక్టర్ స్పందించి తనకు, తన కుమారుడికి న్యాయం చేయాలని కోరింది.

కేసీఆర్ పాలనలోనే మైనార్టీల అభ్యున్నతి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బాజిరెడ్డి గోవర్ధన్, దాదన్నగారి విఠల్‌రావు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సారంగాపూర్, ఏప్రిల్ 1 : మాజీ సీఎం కేసీఆర్ పాలనలో మైనార్టీల అభ్యున్నతి జరిగిందని, వారికి ఎంతో మేలు చేకూరిందని నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నిజామాబాద్ మండలం గుండారం గ్రామంలోని నూతన మసీదులో ముస్లింలు సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. కేసీఆర్ పదేండ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవించారని, అన్ని వర్గాల కోసం ఎన్నో పథకాలు అమలుచేశారని అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజా, రైతాంగ సంక్షేమాన్ని విస్మరించిందని అన్నారు. అమలుకు సాధ్యం కానీ హామీలను కురిపించి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వడం సరికాదని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా.. రాష్ట్రంలో పాలనను భ్రష్టు పట్టించారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి, ఎంపీపీ అనూషా ప్రేమ్‌దాస్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ అంకల గంగాధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుకర్ రావు, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, నాయకులు జమీర్‌ఖాన్, ఉమాపతి, ప్రభాకర్, మోహన్, పోతన్న, అక్బర్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలు శిక్ష

వినాయక్‌నగర్, ఏప్రిల్ 1 : జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిలో నలుగురికి కోర్టు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. మొత్తం 11 మంది వాహనదారులపై కేసులు నమోదు కాగా ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సోమవారం కోర్టులో హాజరు పర్చగా నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ తీర్పు చెప్పారు. ఏడుగురు వాహనదారులకు రూ.7,400 జరిమానా విధించారు. మిగతా నలుగురు అడుగుల్‌వార్ రాజేందర్‌కు 3 రోజుల జైలు శిక్ష, అజ్మీరా నవీన్, గంగారాం, సుంకరి శ్రీనివాస్‌కు 2 రోజుల చొప్పున జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలోని డీఎల్ఎస్ఏ హాలులో బార్ అసోషియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎన్నికల అధికారి ఆముదాల సుదర్శన్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. బార్ అండ్ బెంచ్ సహాయంతో ముందుకెళ్లాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత కార్యవర్గానికి సూచించారు.
–వినాయక్‌నగర్, ఏప్రిల్ 1

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రెంజల్, ఏప్రిల్ 1: 'ఇందిరమ్మ కాలనీలో దాహం..దాహం' శీర్షికన నమస్తే తెలంగాణలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని కందకుర్తి గ్రామం ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్యను ఎంపీవో గౌసొద్దీన్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్ సింగ్ సోమవారం పరిశీలించారు. పైపులైన్ లీకేజీల కారణంగా సరఫరా అవుతున్న కలుషిత నల్లానీటిని కాలనీకి చెందిన ఓ మహిళ అధికారులకు అందించింది. నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీరు దుర్వాసన వస్తున్నట్లు అధికారులు గమనించారు. కుళాయిలకు ఆన్‌ఆఫ్ బిరడాలు లేక డ్రైనేజీ నీరు తాగునీటి పైపుల్లోకి రివర్స్ వెళ్తోందని అన్నారు. మిషన్ భగీరథ కుళాయిలకు ఉన్న ఫ్లో కంట్రోల్ వాల్వ్‌లను కొందరు తొలిగించి మోటర్‌ను బిగించి నీటిని సేకరిస్తున్నట్లు గుర్తించారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఎంపీవో గౌసొద్దీన్ హెచ్చరించారు. ఫ్లో కంట్రోల్ వాల్వ్‌లను తిరిగి బిగించే పనులు చేపడుతామని కాలనీవాసులకు చెప్పారు. వారి వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీశ్‌చంద్ర ఉన్నారు.

ఇందిరమ్మ కాలనీలో తాగునీటిని పరిశీలిస్తున్న అధికారులు

జాగ్రత్తగా విధులు నిర్వహించాలి

శిక్షణకు హాజరైన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ సూచించారు. సోమవారం బోధన్ పట్టణ శివారులోని ఇందూర్ బీఈడీ కళాశాలలో అధికారులకు శిక్షణ ప్రారంభమైంది. రెండు రోజులపాటు ఈకార్యక్రమం కొనసాగనుంది. ఎన్నికల కమిషన్ నియమావళిని ప్రాజెక్టర్ ద్వారా ప్రదర్శించిన అనంతరం ఆర్డీవో పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రారంభం నుంచి ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు చేర్చేంతవరకు ప్రతి అధికారి విధులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ తహసీల్దార్ గంగాధర్, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

కలు తాగొద్దన్నందుకు మహిళ ఆత్మహత్య

రెంజల్, ఏప్రిల్ 1: మండల కేంద్రానికి చెందిన పిల్లి లక్ష్మి (38) చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయన్న సోమవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. పిల్లి లక్ష్మి కల్లుకు బానిసైంది. కల్లుతాగే అలవాటు మానుకోవాలని ఆమెభర్త కంఠన్న పలుమార్లు చెప్పాడు. ఇదే విషయంలో మార్చి 25న ఇంటివద్ద భార్యాభర్తల మధ్య గొడవజరిగింది. ఇదే విషయాన్ని మనసులో పెట్టుకున్న లక్ష్మి అదేరోజు ఇంటి నుంచి వెళ్లిపోయింది. గ్రామ శివారులోని పెద్ద చెరువులో సోమవారం మృతదేహం లభ్యమైంది. పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బోధన్ దవాఖానకు తరలించారు.

రైస్‌మిల్‌లో చోరీ కేసులో నిందితుల అరెస్టు

నవీపేట, ఏప్రిల్ 1: మండలంలోని పాల్దా రైస్‌మిల్‌లో చోరీ చేసిన ఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, నవీపేట ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన షేక్‌బాబు దొంగతనాలు చేసేందుకు శివాజీ, రాజు, నయాబలే, బాదావత్ సునీల్‌ను కూలీలుగా పెట్టుకున్నాడు. వారికి రోజుకు రూ. 400 కూలీ ఇస్తూ వారితోపాటు దొంగతనాలకు పాల్పడుతున్నాడు. షేక్‌బాబు, శివాజీ, రాజు, నయాబలే, బాదావత్ సునీల్ మార్చి 30న పాల్దా శివారులోని శ్రీ వెంకటేశ్వరా ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్‌లో మిషనరీని చోరీ చేశారు. గ్రామస్తులు వారిని గమనించడంతో నలుగురు తప్పించుకొని పారిపోయారు. సునీల్‌ను పట్టుకున్న గ్రామస్తులు కర్రలతో దాడి చేశారు. దీంతో సునీల్ మృతి చెందాడు. తప్పించుకొని పారిపోయిన షేక్‌బాబు, శివాజీ, రాజు, నయాబలే అనే నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. మరో నిందితుడు బాదావత్ సునీల్ మృతి చెందిన ఘటనలో పాల్దా గ్రామానికి చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

4న కంటి వైద్య శిబిరం

శక్కర్‌నగర్, ఏప్రిల్ 1: బోధన్ పట్టణంలో ఈనెల 4న విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంగయ్య, రాజేశ్వర్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఆరోగ్యరక్ష కార్డు లబ్ధిదారులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

శక్కర్‌నగర్, ఏప్రిల్ 1: బోధన్ పట్టణ పరిధిలోని బెల్లాల్ ప్రాంతంలో పేకాట స్థావరంపై బోధన్ పట్టణ సీఐ వీరయ్య, సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ. 5740 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. పేకాట ఆడినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

తిమ్మాపూర్‌లోని రెండు ఆలయాల్లో చోరీ

వేంకటేశ్వర ఆలయంలో చిందరవందరగా పడేసిన వస్తువులు

మోర్తాడ్, ఏప్రిల్ 1: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని వేంకటేశ్వర, దుర్గామాత ఆలయాల్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామం మధ్యలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం తాళం పగలగొట్టి ఆలయంలోని బీరువాను తెరచి అందులో ఉన్న విలువైన వస్తువులు, హుండీ పగలగొట్టి అందులో ఉన్న డబ్బును ఎత్తుకెళ్లారు. గ్రామ శివారులో ఏర్గట్ల వెళ్లేదారిలో ఉన్న దుర్గామాత ఆలయం తాళం పగలగొట్టారు. మోర్తాడ్ పోలీసులు సంఘటనా స్థలాలను సోమవారం ఉదయం పరిశీలించారు.

టెట్ ఫీజు తగ్గించాలి

మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్

ఆర్మూర్‌టౌన్,ఎప్రిల్1: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన టెట్ పరీక్ష ఫీజులను వెంటనే తగ్గించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ హెచ్చరించారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా నిరుద్యోగులు హాస్టళ్లలో ఉంటూ గ్రంథాలయాల్లో చదువుకుంటూ పరీక్షలకు సిద్ధమవుతున్నారని అన్నారు. ఫీజులు పెంచడం వల్ల పేద అభ్యర్థులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, SYED MUNAWAR S/o. SYED MOHAMMED ALI R/o. H.No.1-14-17, Indra nagar Colony, Noor masjid, Kamareddy, TS Change my name as SYED MUNWAR S/o. SYED MOHAMMED ALI
NTZ-324762

CHANGE OF NAME
★I, MOHAMED ALI S/o. SYED KAJA MIYA R/o. H.No.4-8-5, Islampura, Kamareddy. T.S Changed My New Name as SYED MOHAMMED ALI S/o. SYED KAJA MIYA
NTZ-324763

CHANGE OF NAME
★I'm PODDUTURI MANASA, W/o. Podduturi Charan Reddy, R/o. 1-1-65/1, Armoor, Nizamabad District, TS. Changed My Name as PODDUTURI MANASA REDDY, W/o. Podduturi Charan Reddy.
NT-311778

CHANGE OF NAME
★I'm KANDARAPU GANGAMANI, W/o. Kandarapu Ramesh, R/o. 11-29, Balkonda, Nizamabad District, TS. Changed My Name as KANDARAPU GANGU, W/o. Kandarapu Ramesh.
NT-311778

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

విద్యార్థిని సమత

కమ్మర్‌పల్లి/బోధన్ రూరల్ , ఏప్రిల్ 1: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని విజ్ఞాన జ్యోతి పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని పాలెపు లోక్షిత్ కన్నా జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో సీటు సాధించారు. విద్యార్థిని పాఠశాల యాజమాన్యం శాలువాలతో సత్కరించి జ్ఞాపిక అందించినట్లు కరస్పాండెంట్ దేవేందర్ తెలిపారు. హెచ్ఎం సౌమ్య, ఉపాధ్యాయులు సరిత పాల్గొన్నారు. బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గోదాల దేవయ్య కుమార్తె సమత నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి అర్హత సాధించింది. సమత గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఇంటి వద్దనే నవోదయ పోటీ పరీక్షకు సిద్ధం అయ్యిం సీటు సాధించింది. విద్యార్థినిని గ్రామస్తులు అభినందించారు.

తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలి